క్లుప్తంగా

నేడు పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏయూ వీసీ ప్రసాదరెడ్డి

ఏయూక్యాంపస్: సమైక్య భారతి, బీచ్ వాకర్స్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలకు సంబంధించిన పోస్టర్‌ను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి బుధవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సమైక్య భారతి జాతీయ సమన్వయకర్త పి.కన్నయ్య మాట్లాడుతూ బీచ్ రోడ్డులోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద గురువారం సాయంత్రం 5 గంటలకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. తెలుగు జాతి కోసం తన ప్రాణాన్ని తృణప్రాయంగా అర్పించి, ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని కాపాడిన గొప్ప వ్యక్తి శ్రీరాములని కొనియాడారు. అటువంటి మహనీయుడిని గౌరవించి జయంతి వేడుకలు నిర్వహించడం ప్రతి ఆంధ్రుడికి గర్వకారణమన్నారు. సభానంతరం సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్ర అప్పారావు, పొట్టి శ్రీరాములు జయంతి వేడుకల ఆహ్వాన సంఘం అధ్యక్షుడు డాక్టర్ బూసి వెంకటస్వామి పాల్గొన్నారు.

కోరాపుట్-కొత్తవలస లైన్‌లో తనిఖీలు

అభివృద్ధి పనులు పరిశీలించిన జీఎం మనోజ్‌శర్మ


శివలింగపురం స్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న జీఎం మనోజ్‌శర్మ, డీఆర్‌ఎం సత్పతి

తాటిచెట్లపాలెం : ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ మనోజ్ శర్మ రెండో రోజు బుధవారం కూడా వాల్తేర్ డివిజన్ పరిధిలో గల కోరాపుట్ – కొత్తవలస లైన్లో డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతితో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ సెక్షన్ పరిధిలో కోరాపుట్, అరకు, బొర్రా గుహలు, శివలింగపురం స్టేషన్ల మధ్య సైడింగ్స్, రైల్వే కార్యాలయాలు, స్టేషన్లను తనిఖీ చేశారు. విండో ట్రెలింగ్ తనిఖీల ద్వారా మలుపులు, వంతెనలు, పాయింట్స్ అండ్ క్రాసింగ్స్‌లను క్షుణ్ణంగా పరిశీలించారు. కోరాపుట్ – కొత్తవలస సెక్షన్‌లో జరుగుతున్న డబ్లింగ్ పనులు, కోరాపుట్ రైల్వే స్టేషన్‌లో గల రన్నింగ్ రూం, రెస్ట్ హౌస్‌లను పర్యవేక్షించారు. అనంతరం రన్నింగ్‌రూంలో లోకో పైలట్స్, ట్రెస్ మేనేజర్స్‌తో మాట్లాడారు. అరకు రైల్వేస్టేషన్‌లో ఏర్పాటు చేసిన వన్‌స్టేషన్ – వన్ ప్రొడక్ట్ స్టాల్‌ను, రెస్ట్‌హౌస్‌లను కూడా పరిశీలించారు. అమృత్‌భారత్ పథకం కింద ఈ స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. చిమిడిపల్లి వద్ద గల టన్నెల్స్‌ను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఇటీవల గూడ్స్ రైలు ప్రమాదం జరిగిన శివలింగపురం యార్డ్‌ని పరీక్షించారు. పర్యటనలో పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థి అదృశ్యం


జ్ఞానసాయివర్మ

బీచ్‌రోడ్డు: పదో తరగతి విద్యార్థి అదృశ్యమైన ఘటన మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. జీవీఎంసీ 28వ వార్డు ఊటగెడ్డ ప్రాంతానికి చెందిన మద్దల రామరాజు, రోజా దంపతుల కుమారుడు మద్దల జ్ఞానసాయివర్మ కేడీపీఎం హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్నాడు. సోమవారం ఉదయం 8.45 గంటలకు స్కూల్‌కు వెళ్లిన జ్ఞానసాయి రాత్రి 8 వరకు ఇంటికి రాలేదు. విద్యార్థి స్నేహితులను, కుటుంబ సభ్యులను విచారించిన ఆచూకీ తెలియకపోవడంతో బుధవారం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ముడసర్లోవకు హంగులు

- కొంగొత్తగా రూపుదిద్దుకుంటున్న ప్రాంతం
- ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ సందర్శనకు రానున్న విదేశీ అతిథులు
- వారిని ఆకట్టుకునేలా అధికారుల ఏర్పాట్లు
- మిలమిలా మెరిసిపోతున్న రహదారులు


ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ వద్దకు వెళ్లే మార్గానికి రంగులు


డెబ్రిస్‌ను తొలగించి శుభ్రం చేసిన ముడసర్లోవ రిజర్వాయర్ వెనుక రోడ్డు

ఆరిలోవ: ముడసర్లోవ ప్రాంతానికి కొత్తదనం వస్తోంది. ఈ నెల 28, 29 తేదీల్లో జరగనున్న జీ 20 సదస్సు నేపథ్యంలో నగరానికి విదేశీ అతిథులు రానున్నారు. వీరు ముడసర్లోవ రిజర్వాయర్‌లో జీవీఎంసీ ఏర్పాటు చేసిన ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్‌ను సందర్శించనున్నారు. దీనికి సంబంధించిన ప్రణాళికను కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్ ఇప్పటికే సిద్ధం చేశారు. ఇటీవల జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు, నగర పోలీస్ కమిషనర్ శ్రీకాంత్ వేర్వేరుగా ఈ ప్రాంతాన్ని సందర్శించారు. ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ వద్ద ఎలాంటి ఏర్పాట్లు చేయాలి, ఏవిధంగా రక్షణ చర్యలు చేపట్టాలో ప్రణాళిక రూపొందించారు. దీంతో అతిథులను ఆకట్టుకునేలా ఈ ప్రాంతాన్ని సిద్ధం చేస్తున్నారు. ఇందులో భాగంగా రిజర్వాయర్ వెనుక ప్రాంతాన్ని శుభ్రం చేస్తున్నారు. ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ వద్ద సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. జీవీఎంసీ అధికారులు కొన్ని రోజులుగా ఇక్కడ పనులు చేపడుతున్నారు. నిన్నటి వరకు గృహ వ్యర్థాలు, చెత్తతో నిండిపోయిన ఇక్కడి రోడ్లను పరిశుభ్రం చేయించారు. కుప్పలుగా నిండిపోయిన డెబ్రిస్‌ను తొలగించి రోడ్లను అద్దంలా తయారు చేస్తున్నారు.

ఆకర్షణీయంగా..

సుమారు నెల రోజుల కిందట ఇక్కడి జీవీఎంసీ ఖాళీ స్థలాలు చుట్టూ రక్షణ గోడలు నిర్మించారు. వాటికి ఇప్పుడు పెయింట్ వేసి అందంగా తయారు చేశారు. సోలార్ ప్లాంట్ ఆవరణలో రహదారులు, వాటికి ఇరుపక్కలా వివిధ ఆకర్షణీయమైన మొక్కలు నాటుతున్నారు. ముడసర్లోవ రిజర్వాయర్ నీటి మధ్యలో ఏర్పాటు చేసిన ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ వద్దకు చేరుకునే వంతెన లాంటి రహదారికి రంగులు వేసి రూపరేఖలు మార్చుతున్నారు. దీంతో హనుమంతవాక నుంచి రామకృష్ణాపురం వరకు రోడ్డు మధ్య డివైడర్లకు రంగులు, ఇరుపక్కలా గోడలకు వివిధ రకాల బొమ్మలతో ఆకర్షణీయంగా తయారు చేస్తున్నారు.

ప్రత్యేక ఏర్పాట్లు..

జీ-20 సదస్సుకు సుమారు 40 దేశాల నుంచి ప్రతినిధులు రానున్నట్లు అధికారులు ప్రకటించిన విషయం తెలిసిందే. రెండు రోజులు పాటు జరగనున్న ఈ సదస్సు అనంతరం ఈ నెల 30న సోలార్ ఫ్లోటింగ్ ప్లాంట్‌ను అతిథులు సందర్శించనున్నారు. ఈ మేరకు వారి కోసం అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. అతిథులు ఇక్కడ విశ్రాంతి తీసుకోవడానికి ఆధునిక వసతులతో తాత్కాలికంగా టెంట్ హౌస్ నిర్మించనున్నారు. ఆఘమేఘాల మీద అన్ని హంగులతో ప్రత్యేకంగా ఆధునిక మరుగుదొడ్లు నిర్మిస్తున్నారు. ఈ ప్రాంతాన్ని వివిధ రకాల పూల మొక్కలు, పచ్చదనంతో సుందరీకరణ పనులు చేపడున్నారు. ఈ చర్యలతో ముడసర్లోవ ప్రాంతానికి మహర్దశ వచ్చిందని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


విదేశీ అతిథుల కోసం నిర్మిస్తున్న మరుగుదొడ్లు


రిజర్వాయర్ వెనుక ప్రాంతంలో నిర్మిస్తున్న రోడ్డు

ప్రశాంతంగా ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు

కృష్ణా కాలేజీ పరీక్ష కేంద్రానికి 1,323 మంది హాజరు

మద్దిలపాలెం: ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మద్దిలపాలెం డాక్టర్.వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన రెండు పరీక్ష కేంద్రాల్లో జరిగిన పరీక్షకు 1,323 మంది విద్యార్థులు హాజరయ్యారు. కృష్ణా జూనియర్ కాలేజీలోని పరీక్ష కేంద్రం ఏలో తొలి రోజు పరీక్షకు 672 మందికి గానూ ఒకరు గైర్హాజరయ్యారని కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ నాగమణి తెలిపారు. డిగ్రీ కళాశాలలోని కేంద్రం బీలో జరిగిన పరీక్షకు 659 మంది విద్యార్థులకు గానూ 652 మంది హాజరయ్యారని కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ సూర్యకుమారి చెప్పారు. ఏడుగురు గైర్హాజరయ్యారన్నారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేశామని వారు పేర్కొన్నారు.

ఇంటర్ పరీక్ష కేంద్రాల్లో పూర్తిస్థాయిలో వసతులు

బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశం


పరీక్ష కేంద్రంలో వైద్య సేవలను పరిశీలిస్తున్న కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, సభ్యుడు గొండు సీతారాం

సీతంపేట: ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాల్లో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశించింది. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు తాగునీరు, విద్యుత్ లైట్లు, ఫ్యాన్లు, వైద్య సేవలు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు కల్పించాల్సిందేనని కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, సభ్యుడు గొండు సీతారాం స్పష్టం చేశారు. బుధవారం ఉదయం ఇంటర్ ఫస్టియర్ పరీక్ష ప్రారంభానికి గంట ముందు సీతంపేటలో ఏర్పాటు చేసిన నాలుగు పరీక్ష కేంద్రాల్లో కల్పించిన వసతులను ఇంటర్మీడియట్ ఆర్‌ఐవోతో కలిసి వారు పరిశీలించారు. అనంతరం అప్పారావు, సీతారాంలు మాట్లాడుతూ వివిధ ప్రాంతాల నుంచి పరీక్ష కేంద్రాలకు చేరుకోవడానికి ట్రాఫిక్ సమస్యలతో విద్యార్థులు సతమతమవుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. దీని వల్ల పరీక్ష రాసే అవకాశం కోల్పోయే ప్రమాదముందన్నారు. ఇటువంటి సంఘటనలు తలెత్తకుండా పోలీస్, రవాణా అధికారులకు కమిషన్ ఆదేశాలు జారీ చేస్తుందని చెప్పారు. పరీక్ష కేంద్రంలో నియమించిన వైద్య సిబ్బంది వద్ద ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు తప్ప ఎటువంటి అత్యవసర మందులు, ఫస్ట్ ఎయిడ్ కిట్ లేకపోవడాన్ని గుర్తించారు. దీని వల్ల ప్రయోజనం లేదన్నారు. ప్రతి పరీక్షా కేంద్రంలో వైద్య సేవలందించడానికి తగిన సిబ్బంది, అత్యవసర మందులు, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారికి వారు సూచించారు. ఆర్‌ఐటీపీ ఉమారాణి, మహిళా సంరక్షణ కార్యదర్శులు పాల్గొన్నారు.

రోడ్డు మధ్యలో గేదెల సంచారం

ఇబ్బంది పడుతున్న వాహన చోదకులు


ముడసర్లోవ రోడ్డులో సంచరిస్తున్న గేదెల గుంపు

ఆరిలోవ: ముడసర్లోవ ప్రాంతంలో గేదెల సంచారంతో వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. ఇవి వాహనాలకు అడ్డం పడటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. చినగదిలి నుంచి అడవివరం వరకు బీఆర్‌టీఎస్ రోడ్డుతోపాటు ముడసర్లోవ రిజర్వాయర్ వెనుక రోడ్లపై గేదెలు నిత్యం సంచరిస్తున్నాయి. చినగదిలి, బాలాజీనగర్, దీన్‌దయాల్‌పురం, దారపాలెం, రామకృష్ణాపురం, శ్రీకృష్ణాపురం ప్రాంతాల్లో కొందరు వీటిని పెంచుతున్నారు. ఉదయం పాలు తీసిన అనంతరం మేత కోసం ఈ రోడ్లులోకి వదిలేస్తున్నారు. దీంతో ఇవి బీఆర్‌టీఎస్, రిజర్వాయర్ వెనుక రోడ్లపై అడ్డదిడ్డంగా వెళ్తూ వాహనాలకు అడ్డం పడుతున్నాయి. దీంతో వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. నాలుగు రోజుల కిందట పెదగదిలి నుంచి సింహాచలం వైపు వెళ్తున్న ఆటోకు ముడసర్లోవ దరి గోల్ఫ్ క్లబ్ ఎదురుగా ఓ గేదె అడ్డం వచ్చింది. డ్రైవర్ షడన్ బ్రేక్ వేయడంతో ఆటోలో ఉన్న రవీంద్రనగర్‌కు చెందిన ఓ మహిళ కిందపడి తీవ్ర గాయాలకు గురై ప్రాణాలు విడిచిన విషయం తెలిసిందే. గతంలో రామకృష్ణాపురం, పైనాపిల్ కాలనీ, శ్రీకృష్ణాపురం ప్రాంతాల్లో బీఆర్‌టీఎస్‌లో ప్రయాణించే కార్లు గేదెలు అడ్డం పడటంతో ప్రమాదలకు గురయ్యాయి. ఆయా సంఘటనల్లో కార్లు బోల్తా పడటంతోపాటు రెండు పాడి గేదెలు కూడా మృతి చెందాయి. పాలు తీసిన అనంతరం గేదెలను రోడ్ విడిచిపెట్టినప్పుడు వాటి యజమానులు కాపలాగా ఉండేలా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి ప్రమాదాలను నియంత్రించాలని స్థానికులు, వాహన చోదకులు కోరుతున్నారు.

క్లాత్ బ్యాగులే మేలు


సీతమ్మధార రైతుబజార్‌లో అవగాహన కల్పిస్తున్న జోన్-3 కమిషనర్ విజయలక్ష్మి

సీతమ్మధార: ప్లాస్టిక్, పాలిథిన్‌కు బదులుగా గుడ్డ సంచులు వాడటం మంచిదని జీవీఎంసీ జోన్-3 కమిషనర్ విజయలక్ష్మి సూచించారు. సీతమ్మధార రైతుబజార్‌లో బుధవారం ప్లాస్టిక్ సంచులను నిషేధించాలంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. ప్రతి కూరగాయల స్టాల్ వద్దకు ఆమె వెళ్లి ప్లాస్టిక్ బ్యాగుల వినియోగం వల్ల కలిగే నష్టాలను వ్యాపారులకు వివరించారు. ఈ సందర్భంగా జేడీస్ మాట్లాడుతూ ప్లాస్టిక్ సంచుల వినియోగం హానికరమన్నారు. వాటిని సరిగ్గా పారవేయకపోతే కాలువలు, డ్రైనేజీల్లో పేరుకుపోయి అపరిశుభ్రత వాతావరణాన్ని తద్వారా వ్యాధులను కలుగజేస్తాయని చెప్పారు. పర్యావరణానికి మేలు చేసేలా ప్రతి ఒక్కరూ క్లాత్ బ్యాగులు వాడాలని సూచించారు. ప్లాస్టిక్ సంచులు వాడితే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. రైతుబజార్ ఆవరణలోని పండ్ల దుకాణాల్లో వినియోగిస్తున్న సంచులను జేడీస్ విజయలక్ష్మి పరిశీలించి. గుడ్డ సంచులనే వినియోగదారులకు అందించాలని సూచించారు. కార్యక్రమంలో రైతుబజార్ ఈవో కొండబాబు, సహాయకుడు సతీష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగులకు మౌలిక వసతులు కల్పించాలి


లుంబినీ పార్కు ఎదుట నిరసన తెలుపుతున్న దివ్యాంగులు

ఎంవీపీకాలనీ: దివ్యాంగుల సౌకర్యార్థం జిల్లా యంత్రాంగం అన్నిచోట్ల ఫ్రెండ్లీ వాతావరణం, మౌలిక వసతులు కల్పించాలని నగర దివ్యాంగుల సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం అప్పుఘర్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం లుంబినీ పార్కు ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధి డాక్టర్ సురేష్ మీనన్ మాట్లాడుతూ భారత ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమార్థం యూఎన్‌ఆర్‌పీడీ చట్టం 2007ను అందుబాటులోకి తెచ్చిందన్నారు. ఈ చట్టం ప్రకారం ప్రభుత్వ నిర్వహణలో ఉన్న కార్యాలయాలు, విద్యాలయాలు, పార్కులు ఇలా అన్ని చోట్ల జిల్లా యంత్రాంగం దివ్యాంగుల కోసం స్నేహపూర్వక వాతావరణం, మౌలిక వసతులను కల్పించాల్సిన అవసరముందన్నారు. అయితే వీటి కల్పనలో జిల్లా యంత్రాంగం ఉదాసీనంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపించారు. దివ్యాంగుల అవసరాలకు అనుగుణంగా అవసరమైన అన్ని చోట్ల రైలింగ్, ర్యాంప్‌ల సౌకర్యం కల్పించాల్సిన అవసరముందన్నారు. ఏయూతో పాటు పలు ప్రభుత్వ కార్యాలయాల్లో కేవలం తొలి అంతస్తులకు మాత్రమే ర్యాంపుల సౌకర్యం ఉందన్నారు. అయితే అన్ని రకాల ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో కింది, పై అంతస్తులకు సైతం ర్యాంపు, రెయిలింగ్ సౌకర్యాలు కల్పించేందుకు జిల్లా యంత్రాంగం చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు గురుమూర్తి, విజయకుమార్, సత్యనారాయణ, భవాని, త్రినాథ్, తిరుపతి, రఘునాథ్ పండా, గణపతి తదితరులు పాల్గొన్నారు.

పోషకాహార విలువలపై మహిళలకు అవగాహన


అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

ఎంవీపీకాలనీ: మహిళలు, బాలింతలు పోషకాహారం విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జాలరిపేటలోని అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం వాసవ్యా మహిళా మండలి, కుషాల్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా వాసవ్యా మహిళ మండలి ప్రాజెక్టు ఆఫీసర్ శ్రావణి మాట్లాడుతూ బాలింతలు, గర్భిణులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పోషకాహార విలువలు కలిగిన ఆహారాన్ని తప్పక స్వీకరించాలన్నారు. బాలామృతంతో పాటు లడ్డూలు, కూరగాయలు, రాగి సూప్, రాగి పిండి ఆహారంగా స్వీకరించడం ద్వారా కలిగే లబ్ధిని మహిళలకు వివరించారు. గర్భిణులు, బాలింత మహిళలను సంపూర్ణ ఆరోగ్యవంతులుగా మలిచేందుకు కుటుంబ సభ్యులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. ఈ సందర్భంగా వారి ఆరోగ్య పరిరక్షణకు మేలు చేసే పలు వంటకాలను డెమో ద్వారా వండి చూపించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ కో-ఆర్డినేటర్లు భవాని, షర్మిలతో పాటు అంగన్‌వాడీ టీచర్లు దేవి, నాగలక్ష్మి, ఆయాలు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధికి ఉచిత వైద్యం

డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు


ఆరిలోవ ఆఖరి బస్‌స్టాప్ వద్ద మానవ హారం నిర్వహిస్తున్న ఆశ వర్కర్లు, ఏఎన్‌ఎంలు

ఆరిలోవ: ఆరిలోవలో బుధవారం ఎన్‌టీఈపీ, ఆశ వర్కర్లు, ఏఎన్‌ఎంలు క్షయ వ్యాధి నివారణ కోసం జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమం చేపట్టారు. ప్రజలకు అవగాహన కల్పించడానికి ఆరిలోవ కాలనీలో యూపీహెచ్‌సీ వద్ద సైకిల్ ర్యాలీ చేపట్టారు. దుర్గాబజార్, ఆపరేషన్ కాలనీ మీదుగా తిరిగి ఆరిలోవ ఆఖరి బస్‌స్టాప్ వద్దకు చేరుకొంది. అక్కడ వారంతా మానవ హారం చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన డీఎంహెచ్‌వో డాక్టర్ బి.జగదీశ్వరరావు మాట్లాడుతూ క్షయ వ్యాధి సోకిన వారికి జిల్లాతోపాటు నగరంలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచిత వైద్యం అందుబాటులో ఉందన్నారు. క్షయ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇటీవల అందుబాటులోకి వచ్చిన వైఎస్సార్ ఆరోగ్య కేంద్రాల్లో సైతం క్షయ వ్యాధి నివారణకు సంబంధించిన మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. క్షయ అంటువ్యాధని, ఇది ఉన్న వారు తుమ్మినప్పుడు, దగ్గినప్పుడు ఇతరులకు సోకుతుందన్నారు. డీటీసీవో డాక్టర్ పుత్సందరరావు మాట్లాడుతూ జిల్లాలో 1,300 మంది క్షయ వ్యాధితో బాధపడుతున్నారని వెల్లడించారు. వారందరికీ మందులు, వైద్యం ఉచితంగా అందిస్తున్నామన్నారు. నిశ్చయ పోషణ ద్వారా డ్రై రేషన్ ఇస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఆశ వర్కర్లు, జిత్ ఎన్‌జీవోలు, ఏఎన్‌ఎంలు, ఎన్‌టీఈపీ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కాలభైరవస్వామి విగ్రహ ప్రతిష్ట


కాలభైరవస్వామి విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న అక్కరమాని విజయనిర్మల తదితరులు

మద్దిలపాలెం: కొత్త వెంకోజీపాలెంలోగల శ్రీ జ్ఞాన లింగేశ్వరాలయంలో నూతనంగా కాల భైరవస్వామి విగ్రహాన్ని బుధవారం ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమానికి వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్, వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల, వెంకటరావు దంపతులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. 15వ వార్డు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య, 17వ వార్డు కార్పొరేటర్ గేదెల లావణ్య, వార్డు నాయకులు అప్పారి గిరిబాబు, గేదెల నాగరాజుతో కలిసి స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవంలో భాగంగా విగ్రహానికి ధన సహాయం చేసిన బోర వెంకటరమణ దంపతులచే ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయ ప్రధాన అర్చకులు అరవెల్లి సూర్యప్రకాష్‌శర్మ, సుబ్రహ్మణ్య శాస్త్రి, బాల భాస్కరశర్మ భక్తుల పేరిట విశేష పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పీలా వెంకట్, కాళ్ల బాబురావు, మద్దాల బాను, వేగి రాజారావు తదితరులు పాల్గొన్నారు.

ఆకతాయిల దాడులను అరికట్టండి


మద్దిలపాలెం డిపో వద్ద ధర్నా చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

మద్దిలపాలెం: ప్రజా రవాణ వ్యవస్థలో పనిచేసే ఉద్యోగులపై అమానుషంగా దాడులకు పాల్పడిన ఆకతాయిలపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఈ దాడులను ఖండించాలని కోరుతూ బుధవారం మద్దిలపాలెం విశాఖ రూరల్ డిపో వద్ద స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు పి.సూర్యనారాయణ, కార్యదర్శి సీతాలక్ష్మి మాట్లాడుతూ డిపో ప్రాంగణంలో ఇలాంటి ఘటనల జరగడం దురదృష్టకరమన్నారు. డిపో ఎదురుగా వున్న బస్టాప్ నిరుపయోగంగా ఉండడం వలన ఆకతాయిలకు అడ్డాగా మారిందన్నారు. ఇలాంటి సంఘటనలు సిబ్బంది ఆత్మవిశ్వాస్వాని దెబ్బ తీయస్తున్నాయన్నారు. వీటిపై డిపో యాజమాన్యం ప్రత్యేక దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ అండ్ వర్కర్క్ ఫెడరేషన్ ప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన అవసరం


వినియోగదారుల హక్కులను వివరిస్తున్న డాక్టర్ జయ

మద్దిలపాలెం: వినియోగదారుల హక్కులపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ అన్నారు. ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని కళాశాలలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ మనం కొనుగోలు చేసిన వస్తువు నాణ్యతలో మోసపోకుండా చూసుకోవాలన్నారు. అనంతరం వాణిజ్యశాస్త్ర విభాగాధిపతి సీహెచ్ విష్ణుమూర్తి మాట్లాడుతూ వినియోగదారుల హక్కులను వివరించారు. జేకేసీ కోఆర్డినేటర్ రాజశేఖర్ మాట్లాడుతూ వస్తువులు కొనుగోలు చేసినప్పుడు కచ్చితంగా రశీదు తీసుకోవాలన్నారు. కన్స్యూమర్ క్లబ్ కో ఆర్డినేటర్ రాజ్‌కుమార్ వినియోగదారుల హక్కుల ద్వారా చేకూరే ప్రయోజనాలను వివరించారు.

సెయిల్‌లో విలీనంతో స్టీల్‌ప్లాంట్‌కు భవిష్యత్

ఎంపీలకు ఉక్కు అధికారుల సంఘం లేఖలు


ఎంపీలకు రాసిన లేఖలను ప్రదర్శిస్తున్న మాజీ డైరెక్టర్ రావు, సీ ప్రతినిధులు

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించకుండా సెయిల్‌లో విలీనం చేస్తే మంచి భవిష్యత్ ఉంటుందని ఉక్కు అధికారుల సంఘం (సీ) నాయకులు అన్నారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ సమావేశాల్లో ప్రైవేటీకరణ తప్పదని ప్రకటించిన నేపథ్యంలో బుధవారం సీ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో లోకసభ, రాజ్యసభ ఎంపీలకు పెద్ద సంఖ్యలో లేఖలు రాశారు. ఆ లేఖల్లో ప్రైవేటీకరణ ప్రత్యామ్నాయం, సెయిల్‌లో విలీనం, వాటి ఉపయోగాలు, ఉక్కు పరిశ్రమ అభివృద్ధి, కేంద్ర ఉక్కు మంత్రిత్వశాఖ లక్ష్య సాధన, ఉద్యోగాల కల్పన, రిజర్వేషన్లు అమలు వంటి అంశాలను వివరించారు. తక్కువ పెట్టుబడితో ఉక్కు సామర్థ్యం పెంపు గురించి లేఖల్లో వివరించారు. ఈ సందర్భంగా స్టీల్‌ప్లాంట్ మాజీ డైరెక్టర్ (ఆపరేషన్స్) కె.కె.రావు మాట్లాడుతూ విశాఖ ఉక్కుతో ఆంధ్రులకు చాలా అనుబంధం ఉందన్నారు. సెయిల్ నుంచి విడదీసిన విశాఖ ఉక్కును తిరిగి విలీనం చేయడం ద్వారా లాభదాయకమైన ఉత్పాదనకు దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో సీ ప్రధాన కార్యదర్శి కె.వి.డి.ప్రసాద్, ఉపాధ్యక్షులు చంద్ర వెంకటేశ్వరరావు, సంయుక్త కార్యదర్శి నరసింహతోపాటు పలువురు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

తైక్వాండో జాతీయ పోటీలకు మధురవాడ క్రీడాకారులు


ఎంపికైన క్రీడాకారులతో అతిథులు, కోచ్‌లు

మధురవాడ: జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు మధురవాడకు చెందిన 10 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. ఇటీవల యలమంచిలిలో సబ్ జూనియర్ క్యాడెట్ రాష్ట్ర స్థాయి పోటీలు జరిగాయి. వీటి కి మధురవాడ నుంచి 14 మంది క్రీడాకారులు హాజరుకాగా 10 మంది బంగారు, ఒకరు కాంస్య పతకం సాధించారు. వీరిలో 10 మంది ఈ నెల 28 నుంచి 31 వరకు రాజస్థాన్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. మధురవాడ యూత్ తైక్వాండోకు చెందిన జి.భాషిత, ఎ.నిత్యశ్రీ, పి.జ్ఞానశ్రీ, కె.ధనలక్ష్మి, కె.మహేశ్వరరావు, పి.సుధీ ర్, ఎన్.విశాల్, పి.జశ్వంత్ సాయిసూర్య, ఎ.వివేక్ అభిసాయి, టి.మణికంఠ బంగారు పతకాలు గెలుచుకున్నారు. పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు మధురవాడకు చెందిన శ్రీ కనక దుర్గా క్యాటరింగ్ అండ్ సప్లయిర్స్ నిర్వాహకులు కొర్రాయి సురేష్ ఆర్మ్ గార్డ్స్, చికెన్ గార్డ్స్ బుధవారం బహూకరించారు. విజేతలను మధురవాడ యూత్ తైక్వాండో కోచ్‌లు సురేష్, సుకుమార్, సంపత్ తదితరులు అభినందించారు.